క్లుప్తంగా

భీమేశ్వరస్వామిని దర్శించిన డీఐజీ



భీమేశ్వరస్వామి సన్నిధిలో డీఐజీ విజయలక్ష్మి కుటుంబ సభ్యులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామిని శనివారం రాష్ట్ర పోలీస్ కమ్యూనికేషన్స్ డీఐజీ ఎస్ఎస్‌జీ విజయలక్ష్మి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి వారిని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బేడా మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు.

'సుఖీభవ' నిధుల పంపిణీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో మార్కెట్ యార్డు ప్రాంగణంలో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పీఎం కిసాన్ నిధుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, టీడీపీ నాయకులు వాసంశెట్టి సత్యం, రామచంద్రపురం ఆర్డీఓ దేవరకొండ అఖిల తదితరుల చేతుల మీదుగా నియోజకవర్గంలోని 23,828 మంది రైతు కుటుంబాలకు రూ.16.68 కోట్లు నిధులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దూడల శంకరనారాయణ, తహసీల్దార్ బి.మృత్యుంజయరావు, ఎంపీడీఓ కదలి పద్మజ్యోతి, ఏడీఏ నాగకుమార్, ఏఓలు టీవీఆర్ మణిదీప్, ఎ.సద్గురుమూర్తి, వి.అశోక్, రైతులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చక బృందం స్వామిని విశేషంగా అలంకరించారు. పడమర ఖండ్రిక, కోరుమిల్లి, మాచర, తాతపూడి, కపిలేశ్వరపురం, నేలటూరు, వల్లూరు తదితర గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులకు ఆలయ నిర్వహణ కమిటీ, దాతల ఆర్థిక సౌజన్యంతో అన్నదానం చేశారు.

వెనుకబడిన వర్గీయుల అభ్యున్నతికి కృషి



యాండ్ర ప్రభాకరరావు

కపిలేశ్వరపురం (మండపేట): నియోజకవర్గంలో వెనుకబడిన సామాజిక వర్గీయుల అభ్యున్నతికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా నియమితులైన మండపేట పట్టణానికి చెందిన యాండ్ర ప్రభాకరరావు (బుజ్జి) తెలిపారు. తనకు బాధ్యతలను అప్పగించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పర్యవేక్షణలో పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

పీ-4 నీడ్ అసెస్మెంట్ సర్వేపై సమీక్ష



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న రంగారావు

కపిలేశ్వరపురం (మండపేట): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ-4 నీడ్ అసెస్మెంట్ సర్వే, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పీఎం సూర్యఘర్ యోజన పథకాల అమలుపై మండపేట మున్సిపల్ కార్యాలయంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా పథకాల అమలు నేపథ్యంలో పట్టణంలోని సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బందికి కమిషనర్ టీవీ రంగారావు పలు సూచనలు చేశారు. పీ-4 సర్వేను త్వరితగతిన నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి, కార్యాలయ మేనేజర్ జేవీఎస్ శాస్త్రి, అసిస్టెంట్ ఇంజినీర్లు పవన్ కుమార్, అనూషలక్ష్మి, కార్యాలయ అసిస్టెంట్లు, మెప్మా సీఓలు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు



ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి

పెదపూడి: సంపర గ్రామంలో వేంచేసియున్న శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి శ్రావణ శనివారం సందర్భంగా పంచామృతాభిషేకం, అర్చనలు, పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు అధ్వర్యంలో స్వామి వారికి తులసిదళాలతో అమ్మవారికి విశేష కుంకుమ పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతా ప్రజలు భారీ సంఖ్యలో హాజరవ్వగా భక్తులు మంగళహారతుల నడుమ స్వామి వారికి గోవిందనామ స్మరణ చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఏడాది ఎగ్గొట్టి.. అరకొరగా ఇచ్చి..

- కూటమి ప్రభుత్వం చెప్పిందొకటి, చేస్తుందొకటి
- అరకొర సాయానికి విస్తృత ప్రచారం
- 'అన్నదాత సుఖీభవ' పంపిణీ తీరు హాస్యాస్పదం



కపిలేశ్వరపురం మండలంలో సాగు చేస్తున్న రైతులు

కపిలేశ్వరపురం: ప్రభుత్వమంటే పేదల పక్షం వహించాలి. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలపై దృష్టి సారించాలి. ఆర్థిక కారణాలు చెప్పి సమస్యల పరిష్కారాన్ని విస్మరించరాదు. ఎన్ని సమస్యలు ఎదురైనా పేదల సంక్షేమమే లక్ష్యం కావాలి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అదే జరిగేది. ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా రోజుల్లో సైతం ఆంధ్రప్రదేశ్‌లో పేదలికిచ్చే సంక్షేమాన్ని ఆపలేదు. ఆర్థిక కుంటిసాకులు చెప్పలేదు. ఇస్తానన్న సాయాన్ని పరిపూర్ణంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చి చూపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తీరు చేసేది కూసింత, ప్రచారం ప్రపంచమంత అన్నట్టుంది. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదంతా రైతుకు పెట్టుబడి సాయానికి చిల్లిగవ్వంత కూడా ఇవ్వలేదు. ఎన్నికల్లో మాత్రం వైఎస్ జగన్ ప్రభుత్వం కంటే ఎక్కువగా సాయమందిస్తానని ప్రగల్బాలు పలికారు. అధికారంలోకి వచ్చాకా ఏడాది ఎగ్గొట్టడంతో పాటు ప్రస్తుతం ఇస్తున్న సాయం సైతం తొలి విడత అంటూ తగ్గించి ఇస్తుంది.

వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ఇలా

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ 58 నెలల పాలనా కాలంలో పేద, మధ్య తరగతి ప్రజలకు వివిధ సంక్షేమ పథకాల పేరుతో ప్రభుత్వ లబ్ధి క్రమం తప్పకుండా అందేది. వార్షిక సంక్షేమ క్యాలెండర్‌ను అప్పటి సీఎం వైఎస్ జగన్ ప్రకటించిన మాసాల్లో ఖచ్చితంగా ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సాయానికి తోడు అదనంగా మరింత సాయాన్ని అందించేవారు. సాగు సమయం ఆరంభంలోనే పెట్టుబడి సాయంగా మొదటి విడతను అందజేసేవారు. దీంతో రైతు అప్పుకు పోవాల్సిన అవసరం కాస్త తగ్గేది. దమ్ము ట్రాక్టర్లు, కూలీ ఖర్చుల అవసరం వెంటనే తీరేది. మండపేట నియోజకవర్గంలోని రైతులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 58 నెలల కాలంలో వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా మండపేట రూరల్ మండలంలో 7,002 మందికి రూ.29.84 కోట్లు మండపేట పట్టణంలో 2,073 మందికి రూ.7.19 కోట్లు కపిలేశ్వరపురం మండలంలో 8,746 మందికి రూ.38.63 కోట్లు రాయవరం మండలంలో 7,435 మందికి రూ.31.96 కోట్లు మొత్తం నియోజకవర్గంలో 25,256 మంది రైతులకు రూ.107.64 కోట్లు సాయమందింది. పంట రుణాల సున్నా వడ్డీ పథకం పేరుతో మండపేట నియోజకవర్గంలోని 20,321 మంది రైతులకు రూ.7.77 కోట్లు సాయమందింది.

ఏడాది ఎగ్గొట్టిన కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనకు కూటమి ప్రభుత్వ పాలనకు రైతు మేలు కోరే విషయం ఏ మాత్రం పొంతనలేని పరిస్థితి నెలకొంది. వైఎస్ జగన్ రైతు విషయంలో ఇస్తానన్నదే చెప్పేవారు. ఇస్తానన్న సాయాన్ని షెడ్యూల్ ప్రకారం ఇచ్చేవారు. ప్రస్తుత కూటమి 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సాయంతో సంబంధం లేకుండా అదనంగా రూ.20 వేలు ఇవ్వాల్సి ఉంది. ఈ హామీతో ఓట్లు రాబట్టుకునేందుకు కూటమి నేతలు అప్పటి ప్రభుత్వం ఇస్తున్న రైతు భరోసా సాయం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సాయమని, వైఎస్ జగన్ తాను ఇస్తున్నట్టుగా ప్రచారం చేసుకుంటున్నారంటూ దుష్ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చాకా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పీఎం కిసాన్ సాయంతో కలిపే రాష్ట్ర ప్రభుత్వ సాయాన్ని పంపిణీ చేస్తుంది. అది కూడా ఏడాది పాలనలో సాయాన్ని ఎగ్గొట్టింది. ఏడాది కూటమి పాలనలో రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. సాగు ప్రారంభ సమయంలో అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పుడిచ్చే సాయమైనా మొత్తం ఇవ్వకుండా మొదటి విడత అంటూ తగ్గించి ఇస్తుంది.

తీవ్ర ప్రజా వ్యతిరేకతతో మండపేట నియోజకవర్గంలో సాయమిలా

ప్రజల నుంచి తీవ్ర ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ×అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్₹ వ్యవసాయ పెట్టుబడి సాయాన్ని చెల్లించేందుకు సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ పథకం రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతగా రూ.5 వేలు చొప్పున రైతుల ఖాతాకు జమ చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పీఎం కిసాన్ పథకం ద్వారా మండపేట మండలంలో 5,334 మంది రైతు కుటుంబాలకు రూ.1.06 కోట్లు కపిలేశ్వరపురం మండలంలో 6,878 మంది కుటుంబాలకు రూ.1.37 కోట్లు రాయవరం మండలంలోని 4,684 మంది కుటుంబాలకు రూ.93.68 లక్షలు నియోజకవర్గ మొత్తం 16,896 మందికి రూ.3.37 కోట్లు ఖాతాలకు జమకానుంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మండపేట మండలంలో 5,694 మంది రైతు కుటుంబాలకు రూ.2.84 కోట్లు కపిలేశ్వరపురం మండలంలో 7,445 మంది కుటుంబాలకు రూ.3.72 కోట్లు రాయవరం మండలంలోని 5,090 మంది కుటుంబాలకు రూ.2.54 కోట్లు నియోజకవర్గ మొత్తం 18,229 మందికి రూ.9.11 కోట్లు ఖాతాలకు జమజేస్తుంది.

రామచంద్రపురం నియోజకవర్గంలో అరకొర సాయమిలా

పీఎం కిసాన్ పేరుతో కేంద్ర ప్రభుత్వ సాయంగా రామచంద్రపురం మండలంలో 7,349 మంది రైతు కుటుంబాలకు రూ.1.46 కోట్లు కె.గంగవరం మండలంలో 7,609 మంది కుటుంబాలకు రూ.1.52 కోట్లు కాజులూరు మండలంలోని 8,200 మంది కుటుంబాలకు రూ.1.64 కోట్లు నియోజకవర్గ మొత్తం 23,158 మందికి రూ.4.63 కోట్లు ఖాతాలకు జమకానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రామచంద్రపురం మండలంలో 7,770 మంది రైతు కుటుంబాలకు రూ.3.88 కోట్లు కె.గంగవరం మండలంలో 7,458 మంది కుటుంబాలకు రూ.3.72 కోట్లు కాజులూరు మండలంలోని 8,864 మంది కుటుంబాలకు రూ.4.43 కోట్లు నియోజకవర్గ మొత్తం 24,092 మందికి రూ.12.04 కోట్లు ఖాతాలకు అందజేసింది.

వర్క్ ఆర్డర్ ఇవ్వకుండా వేధింపులు



ఉమ్మిడిశెట్టి వీరవేణి

కపిలేశ్వరపురం: గ్రామంలో అభివృద్ధి కార్యక్రమానికి నిధులు మంజూరైనప్పటికీ అధికారులు వర్క్ ఆర్డర్ ఇవ్వకుండా వేధిస్తున్నారని టేకీ ఎంపీటీసీ ఉమ్మిడిశెట్టి వీరవేణి ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ నియోజకవర్గ ప్రజాప్రతినిధి టేకీ గ్రామంలో కళ్యాణ మండపం నిర్మాణానికి అధికారుల ద్వారా అడ్డంకులు కలిగిస్తున్నారన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రూ.16 లక్షలు ఓఎన్‌జీసీ నిధులు, మరో రూ.16 లక్షలు మండల పరిషత్ నుంచి మంజూరవ్వగా భవనం స్లాబ్ వరకూ పూర్తైందన్నారు. పనులు పూర్తి చేసేందుకు ఇప్పుడు మండల పరిషత్ నుంచి రూ.5 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. ఆ నిధులతో పనులు పూర్తి చేసేందుకు సంబంధించిన వర్క్ ఆర్డర్‌ను ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ ఇవ్వట్లేదని పేర్కొన్నారు. పంచాయతీ తీర్మాణం సైతం ఉండి, నిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ వర్క్ ఆర్డర్ ఇవ్వకపోవడం ఎంపీడీఓకు సరికాదన్నారు. రాజకీయ అంశాల నేపథ్యంలో కూటమి నేత ఒత్తిళ్లకు ఎంపీడీఓ ప్రభావితమై వర్క్ ఆర్డర్ ఇవ్వట్లేదని ఆరోపించారు. ప్రభుత్వ అధికారులు ప్రజల పక్షాన పని చేయాలని ఎంపీటీసీ కోరారు.

విద్యారంగంపై ప్లీనరీలో చర్చ

తాళ్లరేవు: కాకినాడలో ఈనెల 3, 4 తేదీల్లో ఎస్ఎఫ్ఐ నిర్వహించనున్న జిల్లా ప్లీనరీ సమావేశాలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం ప్లీనరీ పోస్టర్‌ను విడుదల చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గంగా సూరిబాబు మాట్లాడుతూ, విద్యారంగ సమస్యలపై నిరంతరం రాజీలేని పోరాటం నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాలకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలన్నారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని రాష్ట్రంలో అమలు చేయడం వల్ల విద్య మొత్తం ప్రైవేటీకరణ అవుతుందన్నారు.

మోసానికి మారుపేరు చంద్రబాబు



సభలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశ్



క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పాలకుల మోసాలను వివరిస్తున్న నాయకులు

- గొల్లపాలెం, ఆర్యావటంలలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ
- కూటమి మోసాలపై ప్రజలకు వివరణ

కాజులూరు: మోసానికి, నమ్మక ద్రోహానికి చంద్రబాబు నాయుడు మారుపేరని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా పార్టీ యువజన విభాగ అధ్యక్షుడు, రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. శనివారం మండలంలోని గొల్లపాలెం శివారు ఊడావారిపేట, చీకట్లవారీపేట, ఆర్యావటం తదితర గ్రామాలలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పిల్లి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి తదితర నాయకులు ఇంటింటా పర్యటించి ఎన్నికలలో కూటమి నాయకులు బాండ్ల రూపంలో ఇచ్చిన హమీలు, ప్రస్తుతం ఆ పథకాలు అమలౌతున్న తీరు, పాలకులు ప్రజలను చేస్తున్న మోసాలను వివరించారు. గత వైఎస్సార్ సీపీ పాలనలో ప్రకటించిన నవరత్నాల పథకాలను తుచాతప్పకుండా అమలు చెయ్యటమే కాకుండా ప్రజా సంక్షేమం కోసం ఎన్నికల్లో చెప్పని పథకాలు సైతం అమలు చేశారన్నారు. ఎన్నికల్లో సూపర్‌సిక్స్ పేరుతో తప్పుడు వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన కూటమి నాయకులు వాటిని అమలు చెయ్యలేక అబద్ధాలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు.

డైవర్షన్ పాలిటిక్స్‌ను గమనించాలి

కూటమి పాలకులు చేస్తున్న డైవర్షన్ పాలిటిక్స్‌ను ప్రతీ ఒక్కరూ గమనించాలన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఉమ్మడిగా ఇటింటికీ వెళ్లి జగనన్న పథకాలు అన్నీ కొనసాగిస్తు వారికంటే మరిన్ని పథకాలు అదనంగా అమలు చేస్తామని సూపర్ సిక్స్ పేరుతో పలు పథకాలు ప్రకటించి బాండ్లు ఇచ్చారన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు ఇంటింటికీ వెళ్లి ఆ బాండ్లలో ఉన్న పథకాల క్యూ ఆర్ కోడ్‌ను వారి సెల్ ఫోన్‌లోనే స్కాన్ చేస్తూ ఆ బాండ్లులో ఉన్న పథకాలు మీ ఇంట్లో లేదా మీ సన్నిహితులకైనా అందుతున్నాయా అని స్థానికులను ప్రశ్నించారు. విజ్ఞులైన ప్రజలు కూటమి నాయకుల మోసాలను గమనించి వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో మండల గ్రామాలకు చెందిన పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన సదస్సు



మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రసంగిస్తున్న విద్యా ప్రసన్న

కపిలేశ్వరపురం (మండపేట): ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరూ విలువలతో కూడిన జీవితాన్ని గడపాలని, అలా జీవించడమే శాస్త్రీయమైనదని పలువురు అన్నారు. మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం వరల్డ్ విమెన్స్ ట్రాఫికింగ్ డే సందర్భంగా పోక్సో చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆలమూరు సీనియర్ సివిల్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది బూసి విద్యా ప్రసన్న మాట్లాడుతూ, హ్యూమన్ ట్రాఫికింగ్, పోక్సో చట్టాల ప్రభావాలు, న్యాయ పరమైన రక్షణలపై అవగాహన కల్పించారు. సమస్యను ఎదుర్కొనే బాధితులు చట్ట పరిధిలో న్యాయం కోసం ఆశ్రయించే పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్, కన్వీనర్ కిరణ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు



మందపల్లి శనైశ్చర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మండలంలోని మందపల్లిలో ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని భక్తులు శనైశ్చరా శరణు.. శరణు అంటూ వేనోళ్ల కొలిచారు. శనివారం స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి ప్రాతఃకాల అర్చన అనంతరం భక్తులు తైలాభిషేకాలు, సర్వదర్శనాలు చేసుకున్నారు. దేవస్థానం ఈఓ దారపురెడ్డి సురేష్‌బాబు ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. టిక్కెట్లు, వివిధ సేవల ద్వారా రూ.1,38,065 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. అలాగే అన్నప్రసాద పథకానికి పలువురు భక్తుల ద్వారా విరాళాల రూపంలో మరో రూ.24,434 రాగా మొత్తం 1,62,499 ఆదాయం వచ్చినట్టు ఈఓ సురేష్‌బాబు తెలిపారు. ఆయన తెలిపారు. సిబ్బంది, పలువురు గ్రామస్తులు భక్తులకు అన్నప్రసాద సేవలో పాల్గొన్నారు.

జాతికి జెండా ఇచ్చిన మహనీయుడు పింగళి



పింగళి వెంకయ్యకు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ పాపారావు, అధ్యాపకులు, విద్యార్థులు

కొత్తపేట: భారత జాతికి జెండా ఇచ్చిన మహనీయుడు పింగళి వెంకయ్య అని విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ డీసీహెచ్ పాపారావు అన్నారు. కళాశాల హిస్టరీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పాపారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ జెండా గురించి, పింగళి వెంకయ్య గొప్పతనాన్ని గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.సత్యనారాయణ, కె.అంకమరావు, సీహెచ్ నాగరాణి, సాయి కృష్ణ, విజయ్ కుమార్, నాగ దీపిక, నాగ శ్రీలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

రోగి వైద్యానికి సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: పక్షవాతంతో అనారోగ్యానికి గురైన బాధితుడి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శనివారం రూ.12 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండలంలోని ఊబలంక గ్రామానికి చెందిన అత్తిలి శ్రీనివాస్ (49) బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి నెల రోజులు క్రితం పెరాలసిస్ కారణంగా ఒక చెయ్యి, కాలు పని చేయడం లేదు. రాజమహేంద్రవరంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో కొంత వరకు వైద్యం చేయించి ఆర్థిక స్తోమత లేక ఇంటికి తీసుకువచ్చేశారు. కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరగా ఊబలంకలో శ్రీనివాస్ ఇంటికి వెళ్లి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.12 వేల చెక్కు అందజేశారు.

తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహిద్దాం



తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య అంగన్‌వాడీ సిబ్బంది

ఆలమూరు: తల్లిపాల సంస్కృతిని గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించి శిశువులకు మెరుగైన ఆరోగ్యాన్ని, వ్యాధి నిరోధకశక్తిని పెంపొందించాలని పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి కె.భాగ్యశ్రీ అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరు, నర్శిపూడి, చెముడులంక సెక్టార్ల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు టీఎస్‌వీ నాగలక్ష్మి, వై.అరుంధతి, బి.వరలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ వారోత్సవాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొని తల్లిపాల విశిష్టతను తెలియజేశారు. తల్లిబిడ్డల ఆరోగ్య దృష్ట్యా తల్లులందరూ పుట్టిన శిశువుకు అరగంట లోపే ముర్రుపాలు అందించాలన్నారు. చిన్నారులకు తల్లిపాలు సక్రమంగా అందకపోవడం వల్ల పౌష్టికాహార లేమి ఉత్పన్నమై తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారన్నారు. తల్లిపాలలో ప్రొటీన్లు, రోగ నిరోధక శక్తిని పెంచే విటమిన్లు అధికశాతం ఉంటాయన్నారు. ×డబ్బా పాలు వద్దు-తల్లి పాలు ముద్దు₹ అంటూ నినాదాలు చేశారు. దీంత పాటు తల్లిపాలు త్వరితగతిన జీర్ణమై శిశువు ఎదుగుదలకు తోడ్పడతాయన్నారు. ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రముఖ స్వీట్‌స్టాల్ వ్యాపారి మృతి

తాళ్లరేవు: మండలంలోని సంతపేట సెంటర్‌కు చెందిన ప్రముఖ స్వీట్‌స్టాల్ వ్యాపారి నగుబత్తుల బ్రహ్మానందరావు మృతి చెందారు. ఆయన గత నెల 29 నుంచి కనిపించట్లేదు. ఆయన మృతదేహం శనివారం రామన్నపాలెం సమీపంలో గోదావరిలో లభ్యమైంది. పోలీసులు పరిశీలించి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. గోదావరి వద్ద కాలకృత్యాలు తీర్చుకునే క్రమంలో ప్రమాదవశాత్తు పడిపోయి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. బ్రహ్మానందం మృతి పట్ల జెడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్ సాగర్, స్థానిక నాయకులు సంతాపం తెలిపారు.

డిగ్రీ గణిత అతిథి అధ్యాపకుని పోస్టుకు దరఖాస్తులు

కొత్తపేట: స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్ బోధించుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు తెలిపారు. ఆ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మ్యాథమెటిక్స్‌కు సంబంధించి పీజీలో 55 శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులు ఈనెల 5వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు కళాశాల కార్యాలయంలో సమర్పించాలని కోరారు. 6 వ తేదీ ఉదయం 11 గంటలకు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హతలు కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇతర వివరాలకు 9849711253, 9989027808 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

